

19 వ వసంతంలోకి ...

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
పోలవరం(రంపచోడవరం)జిల్లా

ఆదివారం,1 ఫిబ్రవరి 2026

8 పేజీలు


## అంబటి 'బూతుల' నోటికి..

# సుభాష్ 'చెప్పుదెబ్బ'!

### చంద్రబాబు జోలికొస్తే అడ్రస్ లేకుండా చేస్తాం
### మంత్రి సుభాష్ సింహగర్జన

- ముఖ్యమంత్రిని అంటే..అది ఐదు కోట్ల ప్రజల చెంప మీద కొట్టినట్టే.దానికి వడ్డీతో సహా చెల్లిస్తాం.
- నీ నోటి మురుగుకి చట్టపరంగా తాళం వేసే రోజు దగ్గర్లోనే ఉంది.. జాగ్రత్త!
- చంద్రబాబు, లోకేష్ అభిమానుల రక్తం మరుగుతోంది, మా సహనాన్ని పరీక్షించవద్దు...



రాష్ట్ర రాజకీయాల్లో మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన అసభ్యకర వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్ల ఆయన వాడిన అభ్యంతరకర పదజాలంపై మంత్రి సుభాష్ నిప్పులు చెరిగారు. అంబటి మాటలు ఆయన అహంకారానికి, వైకాపా పతనావస్థకు నిదర్శనమని మంత్రి మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలు ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయని, దీనికి మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. లోకేష్ సైన్యం సిద్ధంగా ఉందని, నోరు అదుపులో పెట్టుకోకపోతే రాజకీయంగా సమాధి చేస్తామని గర్జించారు. చట్టపరమైన చర్యల ద్వారా అంబటి బూతుల నోటికి శాశ్వత తాళం వేస్తామని ఈ సందర్భంగా మంత్రి సుభాష్ స్పష్టం చేశారు.

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

రాష్ట్ర రాజకీయాల్లో సంస్కారానికి, అహంకారానికి మధ్య యుద్ధం మొదలైంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఉద్దేశించి మాజీ మంత్రి అంబటి రాంబాబు వాడిన అత్యంత నీచమైన పదజాలంపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. శనివారం ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో కొమ్మన సతీష్‌తో మాట్లాడుతూ.. మంత్రి సుభాష్ ఈ వ్యవహారంపై అత్యంత ఘాటుగా స్పందించారు. అంబటి చేసిన వ్యాఖ్యలు అతని రాజకీయ సమాధికి పునాది అని, ఇలాంటి నీచపు కూతలు కూస్తే ప్రజలే చెప్పులతో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

**నీది నోరా? మురుగుకాలువనా?..**అంబటి రాంబాబు వ్యాఖ్యలపై మంత్రిసుభాష్ నిప్పులుచెరిగారు."అంబటి..

- తరువాయి 2లో..

## నిరుపేదల సంక్షేమానికి

# తొలి ప్రాధాన్యం

- దేశానికే ఆదర్శంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ
- పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**రావులపాలెం,మేజర్‌న్యూస్:**భారతదేశంలో ఏరాష్ట్రంలోనూ అమలు చేయని సంక్షేమ పథకాలను మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పింఛన్ల పంపిణీ అందులో ఒక భాగమన్నారు. శనివారం రావులపాలెం మండలం కొమరాజులంకలో జరిగిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారికి పింఛన్లను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లపథకంతో దేశానికేఆదర్శంగా నిలిచామన్నారు.ఆదివారం వస్తుంది అంటే ఒకరోజు ముందే పింఛన్లు అందించడం జరుగుతుంద న్నారు. సంక్షేమంతోపాటు అభివృద్ధిలోనూ దూసుకుపోతున్నామన్నారు. కొత్తపేట నియోజకవర్గంలోనే 42069 మందికి సామాజిక, ఆర్థిక భద్రత కోసం పింఛన్లు అందిస్తున్నామని ఆయన అన్నారు. మొత్తం నియోజక వర్గానికి సంబంధించి రూ.18 కోట్ల30లక్షల30వేల రూపాయలుపంపిణీ జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల భాగస్వామ్యంతో విజయవంతంగా జాతీయ రహదారి

# భద్రతా మాసోత్సవాలు

- రోడ్ భద్రత పాటించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత
- సృజనాత్మక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం
- ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై మేఘా స్వరూప్



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** "ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలను క్రమశిక్షణగా పాటించడం మన సామాజిక బాధ్యత అని ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై.మేఘాస్వరూప్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని శనివారం కలెక్టరేట్‌లో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు.

- తరువాయి 2లో..

# అవినీతి రహిత సమాజమే లక్ష్యం





- లోకాయుక్త వ్యవస్థ అభినందనీయం
- సత్యదేవుని సన్నిధిలో ఉప లోకాయుక్త పి.రజిని.. కుటుంబ సమేతంగా వ్రతమాచరణ

**అన్నవరం,మేజర్‌న్యూస్ :** ప్రజాస్వామ్య వ్యవస్థలో సామాన్యుడికి ఆయుధంగా, అవినీతి పరుల గుండెల్లో సింహస్వప్నంగా నిలిచే వ్యవస్థ 'లోకాయుక్త'.అటువంటి అత్యున్నత రాజ్యాంగబద్ధమైన పదవిలో కొనసాగుతున్న రాష్ట్ర ఉప లోకాయుక్త మరియు ఇన్చార్జ్ లోకాయుక్త పి.రజిని శనివారం రత్నగిరి సత్యదేవుని సన్నిధిలో సందడి చేశారు. లోక కల్యాణం కోసం, అవినీతి రహిత పాలన కోసం సత్యదేవుని ఆశీస్సులు కోరుతూ ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ఆధ్యాత్మికతతో మొదలైన పర్యటన..**పి.రజిని తన కుటుంబ సభ్యులతో కలిసిశనివారం ఉదయం అన్నవరం చేరుకున్నారు.ఆలయ సంప్రదాయం ప్రకారం వారికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రత్నగిరిపై వేంచేసి ఉన్న శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి వ్రతాన్నిఅత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆస్థాన వేద పండితులు వారికి వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ ఐ.వి.రోహిత్ మరియు కార్యనిర్వహణ అధికారి వేంద్ర త్రినాధరావు ఆమెకు స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు.

**లోకాయుక్త: సామాన్యుడికి రక్షణ కవచం..**ఈ పర్యటన సందర్భంగా లోకాయుక్త ప్రాధాన్యతను మరోసారి గుర్తు

- తరువాయి 2లో..

# రూ.2 కోట్లతో 'డీపీఆర్‌సీ' భవన నిర్మాణానికి శ్రీకారం



**రాజమహేంద్రవరం రూరల్, మేజర్ న్యూస్** : గ్రామ పంచాయతీల రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులో సరికొత్త అధ్యాయం మొదలైంది. పంచాయతీ ప్రతినిధులకు, అధికారులకు దిశానిర్దేశం చేసే జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి శనివారం శంకుస్థాపన చేశారు.

–శిక్షణతోనే సాధికారత

కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ కేటాయించిన రూ. 2 కోట్ల నిధులతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పంచాయతీల సామర్థ్యం పెరగాలంటే ప్రజాప్రతినిధులకు ఆధునిక శిక్షణ అవసరమని, దానికి ఈ కేంద్రం వేదిక కానుందని తెలిపారు. తొమ్మిది నెలల్లోనే నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టరును ఆదేశించారు.

– నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి పెద్దపీట

– మౌలిక సదుపాయాల కల్పన : ఫిబ్రవరి 2న రూ. 3.50 కోట్లతో బాలాజీ పేట నుంచి రాజవోలు వరకు రహదారి పనులను ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. బొమ్మూరు పరిధిలో ఇప్పటికే రూ. 8.50 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

– తాగునీటి సరఫరా: గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన వాటర్ గ్రిడ్ పనులను పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం కేంద్రం నుంచి రూ. 12 వేల కోట్లు రాబట్టిందని వివరించారు.

–సామాజిక భద్రత: నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ. 247 కోట్లు పెన్షన్ల కోసం వెచ్చించామని, ఈ నెలలో కొత్తగా 44 మందికి పెన్షన్లు మంజూరు చేశామని పేర్కొన్నారు.

–ఏడు గ్రామాలకు 'స్వచ్ఛ' ఈ–ఆటోలు

పరిసరాల పరిశుభ్రతలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అందించిన ఈ–ఆటో రిక్షాలను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ధవలేశ్వరం, దివాన్చెరువు, సీతానగరం వంటి 7 ప్రధాన పంచాయతీలకు వీటిని కేటాయించారు. చెత్త సేకరణలో ఈ వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరిచి, రాబోయే పుష్కరాల నాటికి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శాంతమణి, ఎస్.ఈ బాలకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఆంధ్ర శబరిమలై అయ్యప్పను దర్శించుకున్న జిల్లా అదనపు జడ్జి చంద్రమౌళీశ్వరి

శంఖవరం, మేజర్ న్యూస్ : మండలంలోని సిద్ధివారిపాలెం గ్రామంలో కొలువుదీరిన ప్రముఖ పుణ్యక్షేత్రం ఆంధ్ర శబరిమలై అయ్యప్ప ఆధ్యాత్మిక మహాక్షేత్రంను శనివారం పెద్దాపురం అదనపు జిల్లా జడ్జి జి. చంద్రమౌళీశ్వరి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు ప్రత్తిపాడు సివిల్ జడ్జి ఎల్.గోపినాథ్ కూడా స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వారి రాక సందర్భంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, గురుస్వామి కుసుమంచి శ్రీనివాసరావు ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా పూర్ణ కుంభ స్వాగతంతో ఘనంగా ఆహ్వానించారు. అనంతరం అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, మహా పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు జడ్జి జి. చంద్రమౌళీశ్వరి మాట్లాడుతూ 18 పవిత్ర కొండల మధ్య, సహజ సౌందర్యం నడుమ అత్యంత ప్రశాంత వాతావరణంలో ఆంధ్ర శబరిమలై ఆలయం నిర్మించబడటం భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతతను అందిస్తోందన్నారు. అయ్యప్ప స్వామి స్వప్నంలో దర్శనమిచ్చిన అనంతరం ఈ క్షేత్రం ఆవిర్భవించడం దైవానుగ్రహానికి నిదర్శనమని తెలిపారు. ఇటువంటి అరుదైన పుణ్యక్షేత్రాన్ని రూపుదిద్దిన



వ్యవస్థాపక ధర్మకర్త కుసుమంచి శ్రీనివాసరావును ఆమె ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఈ ఆలయానికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకోవడం, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. చివరగా స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న సామాన్యుడు



**పెరవలి, మేజర్ న్యూస్** : ఖండవల్లి గ్రామంలో రవళి స్పిన్నర్స్‌లో పనిచేసే మండేల అప్పన్న అనే కార్మికుడుకి చెందిన స్టేట్ బ్యాంకు ఖాతా నుండి పలు దఫాలుగా 1 లక్ష 328 రూపాయలు సైబర్ మోసగాళ్లు కాజేశారు అని లబోదిబో అంటున్నాడు. రవళి స్పిన్నర్స్ ఫ్యాక్టరీలో దినసరి కూలీలుగా పనిచేసే భార్యాభర్తలకు చెందిన సొమ్మును సైబర్ నేరగాళ్లు కాజేసిన విషయం తెలుసుకున్న దంపతులు ఇరువురు తణుకు స్టేట్ బ్యాంకుకు వెళ్ళగా సదరు బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యంతో తమను పట్టించుకోలేదని వాపోయారు. అయితే పట్టు విడవకుండా ప్రయత్నించటంతో బీహార్ అడ్రస్‌కు చెందిన సైబర్ నేరగాళ్లు ఈ పని చేసి ఉంటారని ఒక బ్యాంకు ఉద్యోగి తెలపడంతో ఏమి చేయాలో పాల్పోనస్థితిలో బాధిత భార్యాభర్తలు లబోదిబోమంటున్నారు. ఈ విషయంపై ఫిర్యాదు చేయడానికి పోలీసు వారిని సంప్రదిస్తే ఇది తమ పరిధి కాదని సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలియజేయడంతో సైబర్ నెంబర్ 1930 కు కాల్ చేస్తుంటే వారు ఫోన్ లిఫ్ట్ చేయటం లేదని వారు వాపోతున్నారు.

## విద్యార్థుల భాగస్వామ్యంతో విజయవంతంగా జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు

మొదటిపేజి తరువాయి

ఈసందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై.మేఘా స్వరూప్ మాట్లాడుతూ, డిగ్రీ విద్యార్థుల నుంచి ప్రాథమిక స్థాయివిద్యార్థుల వరకు రోడ్‌సేఫ్టీమాసోత్సవాల్లో భాగస్వామ్యం కావడం అభినందనీయమని అన్నారు.రహదారులు, వాహన ప్రయాణాల విషయంలో కొంతనిర్లక్ష్యం కనిపిస్తున్నదని,మానవ తప్పిదాలు, సాంకేతిక లోపాలు,రహదారి నిర్వహణ లోపాలవల్ల ప్రమాదాలు జరుగుతున్నా యని పేర్కొన్నారు.భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందనీ, మీరు సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. తల్లిదండ్రులు, సంరక్షకులు కూడా భద్రతా ప్రమాణాల పాటింపులో అవగాహన కల్పించడంలో ముందుండాలి" అని పిలుపు ఇచ్చారు. జీబ్రా క్రాస్ వద్ద రహదారి దాటడం, లైసెన్స్ పొందడం, ట్రాఫిక్ నియమాలు పాటించడం వంటి అంశాల్లో "ఇతరులు పాటించడం లేదు కదా" అనే భావన వద్దని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా రోడ్ భద్రతా నియమాలను క్రమశిక్షణతో పాటించాలన్నారు. భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని, మీరు సమాజానికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు, సంరక్షకులు కూడా భద్రతా ప్రమాణాల పాటించాలని స్పష్టం చేశారు. వ్యాస రచన, వక్తృత్వం, చిత్రలేఖనం, వీడియో గ్రాఫీ, షార్ట్ ఫిల్మ్, యానిమేషన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వంటి అంశాల్లో విద్యార్థులు సృజనాత్మకతను ప్రదర్శించి రహదారి భద్రతపై సమాజానికి స్పష్టమైన సందేశం ఇచ్చారని తెలిపారు. కార్యక్రమం యొక్క ముఖ్య సందేశాన్ని విద్యార్థులకు తెలియజేస్తూ, చిన్నప్పటి నుంచే రహదారి భద్రతపై అవగాహన పెంపొందించు కోవడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఇందులో భాగస్వామ్యం కావడం అభినందనీయం అన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థినీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

# అంబటి 'బూతుల' నోటికి.. సుభాష్ 'చెప్పుదెబ్బ'!

మొదటిపేజి తరువాయి

అధికారం పోయిన పిచ్చితో రోడ్డు మీద పడి మొరుగుతున్నావు. సిఎం చంద్రబాబు నలభై ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న ఒక మహోన్నత నాయకుడిని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని పట్టుకుని అంత నీచమైన బూతులు తిడతావా? నీది నోరా లేక మురుగు కాలువనా? నీవు వాడిన ప్రతి మాట నీ సంస్కారహీనతకు, మీ పార్టీ పతనావస్థకు నిదర్శనం" అని ధ్వజమెత్తారు.

**లోకేష్ సైన్యం సిద్ధం.. జాగ్రత్త!**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చంద్రబాబు, నారా లోకేష్ అభిమానుల రక్తం మరుగుతోందని మంత్రి హెచ్చరించారు. "ఒక్కసారి మా సైనికులు తలచుకుంటే నువ్వు ఇల్లు దాటి బయటకు రాలేవు. మా నాయకుడు నేర్పిన క్రమశిక్షణ మమ్మల్ని ఆపుతోంది కానీ, మా ఓపికకు హద్దులు దాటితే నీకు నీడ కూడా దొరకదు. లోకేష్ యువసేన తలచుకుంటే నీ అడ్రస్ గాలిలో కలిసిపోతుంది" అని హెచ్చరించారు.

**చట్టం తన పని తాను చేస్తుంది!**

కేవలం మాటలతోనే సరిపెట్టబోమని, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రిని దూషించినందుకు అంబటిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. "గత ఐదేళ్లుగా బూతులతోనే కాలం గడిపారు, అందుకే ప్రజలు మిమ్మల్ని చెత్తబుట్టలో వేశారు. ఇకనైనా పద్ధతి మార్చుకోకపోతే శాశ్వతంగా జైలు గోడల మధ్య నువ్వే నీ బూతు పురాణం వినాల్సి వస్తుంది" అని మంత్రి సుభాష్ హెచ్చరికలు జారీ చేశారు.

# అవినీతి రహిత సమాజమే లక్ష్యం

మొదటిపేజి తరువాయి

చేసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం మరియు సామాన్య ప్రజల మధ్య వారధిగా ఈ వ్యవస్థ పనిచేస్తుంది.

– అధికార జవాబుదారీతనం: ప్రభుత్వ యంత్రాంగంలో జాప్యం జరిగినా, అధికారులు తమ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా లోకాయుక్త అండగా నిలుస్తుంది.

– ప్రజా ఫిర్యాదుల పరిష్కారం: సామాన్యుడు ఎటువంటి భయం లేకుండా ఉన్నత స్థాయి అధికారుల అవినీతిపై ఇక్కడ ఫిర్యాదు చేయవచ్చు.

– పారదర్శకత: పరిపాలనలో పారదర్శకతను పెంచడం, ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా చూడటంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోంది.

**విధి నిర్వహణలో నిబద్ధత..**ప్రస్తుతం ఇన్చార్జ్ లోకాయుక్తగా బాధ్యతలు నిర్వహిస్తున్న పి.రజిని అనేక కేసులను నిశితంగా పరిశీలిస్తూ, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా పెన్షన్ దారులు, ప్రభుత్వ సేవల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్యుల పక్షాన నిలబడి న్యాయం చేకూర్చడంలో ఆమె కృషి అభినందనీయం.లోకాయుక్త వంటి శక్తివంతమైన సంస్థలు ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని, సత్యదేవుని ఆశీస్సులతో ఈ వ్యవస్థ మరిన్ని ప్రజాహిత పనులు చేపట్టాలని భక్తులు ఆకాంక్షించారు.

## జగన్మోహిని కేశవస్వామికి ప్రత్యేక పూజలు

**– నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళాలు**




**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ర్యాలి జగన్మోహిని కేశవ స్వామివారి ఆలయంలో శనివారం శని త్రయోదశి పర్వదినం సందర్భంగా ఆలయ అర్చకులు మేల్కొలుపు అర్చన పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు శ్రీ స్వామివారి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. నిత్య అన్నదాన పథకానికి కిర్లంపూడి చెందిన పెదిరెడ్డి దియాక్ష్ సహాన తన్వి రూ.10,116లు; రాజమహేంద్రవరం చెందిన వల్లూరిపల్లి నాగమల్లేశ్వరరావు, జ్యోతి ప్రమీల దంపతులు రూ.10,800లు; ఆలయ అభివృద్ధి పనులు నిమిత్తం రూ.5,116లు విరాళంగా అందించారు. వారికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను స్వామివారి చిత్రపటం అందించారు.

# 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి





- ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు
- జెడ్పీటీసీ కుడుపూడి, ఎస్.ఎం.సి ఛైర్మన్ నందం
- రావులపాలెం జెడ్పీ బాలుర హైస్కూల్లో ఘనంగా వార్షికోత్సవం

**రావులపాలెం, మేజర్ న్యూస్ :** ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రావులపాలెం జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, జెడ్పీ బాలుర హైస్కూల్ ఎస్.ఎం.సి ఛైర్మన్ నందం వీర వెంకట సత్యనారాయణ తెలిపారు. శనివారం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన జెడ్పీటీసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులు అందజేస్తానని ప్రకటించారు. అలాగే రావులపాలెం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తానని పాఠశాల ఎస్.ఎం.సి ఛైర్మన్ నందం వీర వెంకట సత్యనారాయణ ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరాజు, బాలికల ఉన్నత పాఠశాల ఎస్.ఎం.సి ఛైర్మన్ కోట సోమేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధి పనులలో అవకతవకలు

**- రూ.1,33,652లు రికవరీకి ఆదేశాలు**

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఆత్రేయపురం మండలంలో ఏడాది కాలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై శనివారం నిర్వహించిన సామాజిక తనిఖీలో పలు అవకతవకలు బయటపడ్డాయి. 2025 జనవరి నుండి 2026 జనవరి వరకు ఏడాది కాలంలో చేపట్టిన పనులకు సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల వారీగా తనిఖీలు నిర్వహించారు. సామాజిక తనిఖీ నివేదికను మండల ప్రజాపరిషత్ కార్యాలయపు ఆవరణలో ప్రజా వేదికలో వివరించారు. సామాజిక తనిఖీల్లో కోటి 34 లక్షల రూపాయలతో చేపట్టిన 538 పనులకు ఆడిట్ నిర్వహించారు. సామాజిక తనిఖీల్లో వివిధ పనుల్లో జరిగిన ఆవకతవకాలు సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది నుంచి నుంచి రూ.1,33,652 రూపాయలు రికవరీ చేయాలని సామాజిక తనిఖీ బృందం ఆదేశించినట్లు సమావేశంలో వెల్లడించారు.సామాజిక ప్రజా వేదికలో ప్రాజెక్ట్ డైరక్టర్, డ్వామా, ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. ఎస్.మధుసూదన్, అంబుర్స్‌మెన్ అడపా శ్రీనివాస్, అడిషనల్ విజిలెన్స్ ఆఫీసర్, కె.సత్యనారయణ, సోషల్ ఆడిట్ ఎస్.ఆర్.పి టి.వెంకటేశ్వర్లు, మండల పరిషత్ పరిపాలనాధికారి, వి.రామ స్వరూప్, డిప్యూటి యం.పి.డి.ఓ పి.వి.ఆర్ కె.రాజు, ఎపిఓ, సి.హెచ్.విజయ రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది, సోషల్ ఆడిట్ టీం తదితరులు పాల్గొన్నారు.



## నేషనల్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో 'ఆదిత్య' ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు మై భారత్ 5 రోజుల పాటు కేరళలో నిర్వహించిన యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు పాల్గొన్నారని ఆదిత్య డిగ్రీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.ఎల్. నాయుడు తెలిపారు.

ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ సెంట్రల్ గవర్నమెంట్ నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు బి.విజయదుర్గ, బి.కుసుమ, మన నగర సంస్కృత్తి, సంప్రదాయాలను కేరళ వాసులకు తెలియపరిచారని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో వివిధ అంశాలమీద విద్యార్థినులకు అవగాహన కల్పించారని కేరళ సాంప్రదాయాలు తెలియపరచటమే కాకుండా, భిన్నత్వంలో ఏకత్వం ఏలా వుంటుందో ఇప్పటి తరానికి తెలియపరుస్తుందని అభిప్రాయ పడ్డారు. ఇందులో భాగంగా ది. 22-01-2026 నుండి 26-01-2026 వరకు యువజన అధికారి అయ్యారని అన్నారు. ఈ అవకాశం తమ విద్యార్థినులకు దక్కినందుకు హర్షం వ్యక్తంచేశారు.

ఈ అవకాశాన్ని దక్కించుకున్న విద్యార్థినులు బి.విజయ దుర్గ, బి.కుసుమ మరియు కళాశాల జాతీయ సేవా కార్యనిర్వహణాధికారి పి.సురేఖదేవిని, ఆదిత్య విద్యాసంస్థల అధిపతి డా॥ యన్ శేషారెడ్డి, సెక్రటరీ డా॥ యన్. సుగుణా రెడ్డి అభినందించారు.

## గురుకుల, ఏకలవ్య మోడల్ స్కూల్స్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా రంపచోడవరం, చింతూరు ఐ.టి.డి.ఏలు పరిధిలోని 5 గిరిజన సంక్షేమ గురుకుల రెసిడెన్సియల్ స్కూల్స్‌లో 400 వందల అడ్మిషన్లకు, అలాగే 6 ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్స్‌లో 360 అడ్మిషన్లకు 2026-27 విద్యా సంవత్సరములో అర్హులైన గిరిజన, గిరిజనేతర విద్యార్థినీ, విద్యార్థుల నుండి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు పోలవరం ఇంచార్జ్ జిల్లా జాయింట్ కలెక్టర్, రంపచోడవరం ఐటీడీఏ పిఓ బి. స్మరణ్ రాజ్ శనివారం తెలిపారు.

**ఆన్‌లైన్ అప్లికేషన్స్ ప్రారంభ తేది..** 05-02-2026 కాగా, ఆన్‌లైన్ అప్లికేషన్స్ చివరి తేది.28-02-2026గా పేర్కొన్నారు. ఆన్లైన్ హాల్ టికెట్లు జారీ తేది.10-03-2026 కాగా ఎంట్రన్స్ పరీక్ష జరుగు తేది.04-04-2026 అని తెలిపారు. ఆన్‌లైన్‌లో https://twreiscet.apcfss.in/ & https://aptwgurukulam.ap.gov.in వివరాలు తెలుసుకోవచ్చునన్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్ రుసుము రూ.50లు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలన్నారు. ఇతర వివరాలు కోసం దగ్గరలోని గురుకుల రెసిడెన్సియల్ స్కూల్స్, ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్స్‌లో సంప్రదించాలన్నారు.

## పసి ప్రాణాల రక్షణే పరమావధి

**- పాఠశాల ఆటోలపై పోలీసుల మానవీయ ముందడుగు!**



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ఉదయం బడికి వెళ్లే ప్రతి బిడ్డ క్షేమంగా తిరిగి ఇంటికి చేరాలనే సంకల్పంతో కాకినాడ జిల్లా పోలీసులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, శనివారం నగరం వ్యాప్తంగా స్కూల్ ఆటోలపై నిర్వహించిన తనిఖీల్లో 130 వాహనాలను సీజ్ చేశారు.

ప్రతి నిబంధన వెనుక ఒక కుటుంబ క్షేమం: పోలీసుల ఈ తనిఖీలు కేవలం జరిమానాల కోసం కాకుండా, చిన్నారుల భద్రత పట్ల బాధ్యతను పెంచేలా సాగాయి. ఆటో డ్రైవర్లను మందలించడం కంటే, వారికి ప్రేమగా కౌన్సెలింగ్ ఇస్తూ పలు సూచనలు చేశారు: మితంగా ప్రయాణం:6+1 మంది పిల్లల కంటే ఎక్కువ మందిని ఎక్కించడం ప్రమాదకరం.

- రక్షణ కవచం: ఆటోకు కుడివైపున ఐరన్ గ్రిల్స్ తప్పనిసరి. ఇది మలుపుల వద్ద పిల్లలు కింద పడకుండా రక్షణ నిస్తుంది.
- బ్యాగుల భద్రత: వాహనం బయట బ్యాగులు వేలాడదీయడం వల్ల ఇతర వాహనాలకు అడ్డంకిగా మారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
- బాధ్యతాయుత డ్రైవింగ్: యూనిఫారం ధరించి, సరైన పత్రాలతో హుందాగా ఉండాలని పోలీసులు డ్రైవర్లను కోరారు.

సమిష్టి సంకల్పం:ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ మరియు ఆర్‌టీఓ అధికారులు పాల్గొన్నారు. "మీరు తరలిస్తున్నది కేవలం పిల్లలను కాదు, దేశ భవిష్యత్తును" అని డ్రైవర్లకు గుర్తు చేస్తూ, తల్లిదండ్రులు కూడా వాహనాల భద్రతను గమనించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. చిన్నారుల చిరునవ్వు చెదరకూడదన్న పోలీసుల ఈ ప్రయత్నం సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది.

సూర్య www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# జన నేత.. జ్యోతుల నవ శకం!

# కాకినాడ జిల్లా పసుపు దళానికి సారథిగా బాధ్యతల స్వీకారం





– జగ్గంపేట నుంచి కాకినాడ దాకా జన జాతర..
– నేడే జిల్లా అధ్యక్షుడిగా నవీన్ కుమార్ ప్రమాణ స్వీకారం

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** రాజకీయ రణక్షేత్రంలో పదునైన వ్యూహం.. కార్యకర్త కష్టంలో తోడుండే గుణం.. తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకుంటూనే తనదైన ముద్ర వేసిన యువ నాయకత్వం.. వీటన్నింటి కలయికే జ్యోతుల నవీన్. కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు చేపడుతున్న తరుణం, జిల్లా రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక మలుపుగా మారబోతోంది.
వారసత్వం నుంచి వైవిధ్యం వరకు..జ్యోతుల నెహ్రూ రాజకీయ వార సుడిగా రంగప్రవేశం చేసినా, నవీన్ తనకంటూ ఒక ప్రత్యేక ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు. పదవులు ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌కు వెన్నుదన్నుగా నిలవడంలో ఆయన సిద్ధహస్తులు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోనూ కార్యకర్తలతో నేరుగా సంబంధాలు కలిగి ఉండటం ఆయనకున్న అతిపెద్ద బలం.
అభివృద్ధి – సంక్షేమమే లక్ష్యంగా..కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, కాకినాడ జిల్లాలోని మౌలిక వసతులు, యువతకు ఉపాధి అవకాశాలు మరియు రైతాంగ సమస్యలపై ఆయనకు స్పష్టమైన అవగాహన ఉంది. జిల్లా అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన తర్వాత, అటు ప్రభుత్వాన్ని, ఇటు పార్టీని సమన్వయం చేస్తూ జిల్లాను ప్రగతి పథంలో నడిపించడమే తన ప్రథమ కర్తవ్యమని ఆయన ఇప్పటికే స్పష్టం చేశారు.
నేడు కాకినాడ జిల్లా వీధుల్లో పసుపు పండగ
మధ్యాహ్నం 2 గంటలకు జగ్గంపేట నుండి ప్రారంభమయ్యే జన ప్రవాహం పెద్దాపురం, సామర్లకోట మీదుగా కాకినాడ నగరాన్ని చేరుకోనుంది. వేలాది వాహనాలు, లక్షలాది మంది కార్యకర్తలతో ఈ ర్యాలీ జిల్లా రాజకీయ చరిత్రలో కనువిందు చేయబోతోంది. సాయంత్రం 5 గంటలకు మెక్లారిన్ హైస్కూల్ మైదానంలో జరిగే బహిరంగ సభ, నవీన్ నాయకత్వ పటిమకు సజీవ సాక్ష్యంగా నిలవనుంది.
ముఖ్య నేతల సమక్షంలో..రాష్ట్ర పార్టీ అధ్యక్షులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ ఉత్సవానికి తరలివస్తుండటం గమనార్హం. అందరినీ కలుపుకుపోయే తత్వం, వివాదరహిత వ్యక్తిత్వం కలిగిన నవీన్ కుమార్ నాయకత్వంలో కాకినాడ జిల్లాలో తెలుగుదేశం పార్టీ తిరుగులేని శక్తిగా ఎదగడంఖాయమనిరాజకీయవిశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# పేదల ముఖాల్లో చిరునవ్వే ప్రభుత్వ ధ్యేయం

– రాష్ట్ర బీసీ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** పేదల ముఖాల్లో చిరునవ్వే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర బీసీ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి పేర్కొన్నారు. శనివారం కొత్తపేట మండలం కొత్తపాలెం గ్రామంలో నిర్వహించిన 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పింఛన్ల పంపిణీని ఒకరోజు ముందుగానే చేపట్టిందని ఆమె తెలిపారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, నిరుపేదల ముఖాల్లో చిరునవ్వు చూడటమే తమ ధ్యేయమని ప్రజల సౌకర్యమే ప్రభుత్వానికి ప్రాధాన్యతని అన్నారు. ఆమె స్వయంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు తెదేపా కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలకు పూర్వవైభవం

– పోటీ పరీక్షల అభ్యర్థులకు వరం!
– రూ.39 కోట్లతో జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్ ఆమోదం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన అధ్యక్షుడు భూపతి రాజు ఈశ్వర్ రాజు వర్మ గ్రంథాలయాల అభివృద్ధిపై తనదైన ముద్ర వేస్తున్నారు. శనివారం కాకినాడ జిల్లా గ్రంథాలయ భవనంలో నిర్వహించిన 2026–27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సమావేశంలో విద్యార్థులు, నిరుద్యోగులు మరియు పెన్షనర్ల ప్రయోజనాలే పరమావధిగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు.
ముఖ్య నిర్ణయాలు...
– పుస్తకాల బడ్జెట్ పెంపు: పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ఏటా వెచ్చించే పుస్తకాల బడ్జెట్‌ను రూ.10 లక్షల నుండి రూ.15 లక్షలకు పెంచుతూ చైర్మన్ నిర్ణయం తీసుకున్నారు.
– మూతపడ్డ కేంద్రాల పునఃప్రారంభం: గతంలో మూతపడిన 4 బుక్ డిపాజిట్ సెంటర్లను (పెద్దాపురం సబ్ జైల్, రాజమండ్రి ఆర్యాపురం, తుని తేటగుంట, కూనవరం జగ్గవరం) తిరిగి ప్రారంభించి, నూతన సిబ్బందికి నియామక పత్రాలు అందజేశారు.
– రూ.39 కోట్ల బడ్జెట్: జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన కోసం సుమారు 39 కోట్ల రూపాయల అంచనా బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు.
బాధితులకు న్యాయం.. సిబ్బందికి దిశానిర్దేశం
ఈ సందర్భంగా చైర్మన్ ఈశ్వర్ రాజు వర్మ మాట్లాడుతూ, గత పాలకుల హయాంలో ఎవరికైనా అన్యాయం జరిగి ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, వారికి తక్షణమే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. గ్రంథాలయాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పెన్షన్ సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు."గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిలయాలు మాత్రమే కాదు, అవి జ్ఞాన భాండాగారాలు. ప్రతి ఉద్యోగి బాధ్యతగా పనిచేసి వీటికి పూర్వవైభవం తీసుకురావాలని చైర్మన్ భూపతి రాజు ఈశ్వర్ రాజు వర్మ కోరారు.
ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా పౌర సంబంధాల అధికారి, జిల్లా పంచాయతీ అధికారి , వయోజన విద్య ఉపసంచాలకులు, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పోలంకి నాగరాజు, డిప్యూటీ లైబ్రేరియన్ కిషోర్, సీనియర్ అసిస్టెంట్ శ్రావ్య మరియు ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫోర్ వీల్ డ్రైవింగ్‌లో గిరిజన యువతకు శిక్షణ



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా రంపచోడవరం ఐటిడిఏ ఆధ్వర్యంలో నిరుద్యోగ గిరిజన యువకులకు 4 వీల్ డ్రైవింగ్‌లో ఉచితంగా స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాన్ని అడ్డతీగల వై.టి.సి లో నిర్వహించబడుతుందని రంపచోడవరం ఐటీడీఏ పివో బి.స్మరణ్ రాజ్ శనివారం తెలిపారు. ఆసక్తి కలిగి అర్హత గల అభ్యర్థులు తేదీ 05.02.2026 సాయంత్రం 5.00 గంటలలోపు కార్యాలయం పని దినములలో పథక నిర్వహణాధికారి, ఐటిడిఏ కార్యాలయం, రంపచోడవరంలో స్వయంగా గానీ లేదా రిజిస్టర్డ్ పోస్టు ద్వారా గానీ దరఖాస్తులు సమర్పించవలసిందిగా సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమం వై.టి.సి. అడ్డతీగలలో 09.02.2026 నుండి ప్రారంభమవుతుందని, శిక్షణా కాలంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తారని ఐటీడీఏ పథక నిర్వహణాధికారి స్మరణ్ రాజ్ తెలియజేశారు.
ఉచిత నైపుణ్య శిక్షణ వివరాలు: కోర్స్ పేరు : 4 వీల్ డ్రైవింగ్, విద్యార్హత : 8వ తరగతి ఉత్తీర్ణత లేదా అంతకు పైగా, వయస్సు : 18 సంవత్సరాలు పూర్తిచేసి 35 సంవత్సరాలలోపు, కులము : గిరిజన తెగలు (ఎస్టీ)– పురుషులు మాత్రమే అర్హులు, శిక్షణ కాలం : 60 రోజులు, శిక్షణ స్థలం: వై.టి.సి, అడ్డతీగల, వివరాలకు మేనేజర్, వైటిసి, సెల్ నెం.8500 604897/ 9581810049/ 7569098197లో సంప్రదించాలని విజ్ఞప్తి చేసారు.

## దివిలి కిట్స్‌లో ప్రాంగణ ఎంపికలు

– ఎంపికైన అభ్యర్థులను అభినందించిన చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఫైనల్ ఇయర్ విద్యార్థులకు స్పైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ప్రై.లిమిటెడ్ కంపెనీ బృందం వర్చువల్‌గా విద్యార్థులకు పరీక్షలు మరియు వర్చువల్‌గా ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగింది. ఈ ఇంటర్వ్యూలో సుమారు 189 మంది విద్యార్థులు పాల్గొనగా, 38 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు అభినందిస్తూ రాబోయే రోజులలో మరింత అభివృద్ధి చెందాలని తెలిపారు. అనంతరం ఇకముందు వచ్చే ప్రాంగణ ఎంపికలలో మిగిలిన విద్యార్థులు ప్రతిభ చూపి, అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారిణి మధులత, హెచ్ఓడిలు, పాల్గొన్నారు.

## పాదగయా క్షేత్రాన్ని దర్శించుకున్న ఏపీ ఉప- లోకాయుక్త

– ఉప –లోకాయుక్త పగిడి రజని దంపతులు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** శ్రీ కుక్కుటేశ్వరస్వామి వారి దేవస్థానం (పాద గయా క్షేత్రాన్ని) ఆంధ్ర ప్రదేశ్ ఉప – లోకాయుక్త పగిడి రజని దంపతులు దర్శించుకున్నారు. వారికి డిప్యూటీ కమిషనర్ డి.ఎల్.వి.రమేష్ బాబు, జిల్లా దేవదాయ శాఖ అధికారి కనపర్తి నాగేశ్వరరావు, ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ వడ్డే ఫణికుమార్ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం శ్రీ దత్తాత్రేయ స్వామి, శ్రీ కుక్కుటేశ్వర స్వామి వారిని, శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవార్లను దర్శనం చేసుకుని విశేష పూజలు ఆచరించారు. పూజల అనంతరం వారికి వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమములో సిబ్బంది బొల్లం వీరభద్రరావు, రెడ్డెం ప్రసాద్, కొప్పిశెట్టి దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన సత్తెమ్మ తల్లి జాతర

– అమ్మవారికి మేకపోతును కానుకగా సమర్పించిన ఎమ్మెల్యే



**అనపర్తి, మేజర్ న్యూస్ :** మండలంలోని, కొప్పవరం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే జాతర ఉత్సవాలలో మొదటిరోజు కత్తెర కుండతో ప్రారంభమైంది. సంతానం కావాల్సినవారు కత్తెర కుండను తలపై పెట్టుకుని అమ్మవారిని తలపై పెట్టుకున్నట్లుగా భావిస్తూ గ్రామంలో తిరగడంతో సంతానం కలుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. జాతర ప్రారంభ సందర్భంగా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుటుంబ సమేతంగా సత్తమ్మ తల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం సాధించాలని రామకృష్ణారెడ్డి అభిమానులు మల్లిడి వెంకట కృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యం అమ్మవారికి మేకపోతున్న సమర్పిస్తామని మొక్కుకోవడం జరిగింది. రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా అఖండ విజయం సాధించడంతో అభిమానుల మొక్కుబడి ప్రకారం అమ్మవారికి మేకపోతును కానుకగా ఇచ్చి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొప్పురం గ్రామంలోని కర్రి వారి సత్తమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు రెండు సంవత్సరములకు ఒకసారి ఎంతో వైభవంగా మూడు రోజులపాటు జరుగుతాయని, శనివారం మొదటిరోజు కత్తెర కుండతో జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయని, రెండవ రోజు పూజారిచే కొరడా దెబ్బల కార్యక్రమం జరుగుతుందని, మూడవ రోజు భక్తులు, ప్రజలు వివిధ వేషధారణలతో భిక్షాటన చేసి అమ్మవారికి సమర్పించే జాతర మహోత్సవ కార్యక్రమం ఎంతో వైభవంగా జరుగుతాయని అన్నారు. ఈ జాతర మహోత్సవాలు మన సంస్కృతి సంప్రదాయాలకు నిలయాలని, ప్రజలందరూ ఒకే కుటుంబ సభ్యుల కలిసిమెలిసి ఉండాలని పూర్వం పెద్దలు ఈ జాతర కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పరిసర ప్రాంత ప్రజలందరూ జాతర మహోత్సవాలకు విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాకినాడలో త్వరలో వరల్డ్ క్లాస్ గూడ్స్ షెడ్ ఏర్పాటు

– డీఆర్‌యూసీసీ సభ్యులు ముత్యాల అనిల్ కుమార్ వెల్లడి

– ఎంపీ సానా సతీష్ బాబు కృషితో రైల్వే అభివృద్ధికి ఊపందుకున్న కాకినాడ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడలో త్వరలోనే వరల్డ్ క్లాస్ గూడ్స్ షెడ్ ఏర్పాటు చేయనున్నట్లు డీఆర్‌యూసీసీ సభ్యులు ముత్యాల అనిల్ కుమార్ తెలిపారు. విజయవాడలో నిర్వహించిన 134వ డీఆర్‌యూసీసీ సమావేశంలో పాల్గొన్న ఆయన, కాకినాడకు సంబంధించిన కీలక రైల్వే అంశాలను క్రమబద్ధంగా, ప్రభావవంతంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ముత్యాల అనిల్ కుమార్ మాట్లాడుతూ, ఎంపీ సానా సతీష్ బాబు సహకారం, మార్గదర్శకత్వంతోనే కాకినాడ రైల్వే అభివృద్ధికి సంబంధించిన అనేక కీలక అంశాలను కేంద్ర రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లగలిగామని తెలిపారు. సమావేశంలో కాకినాడకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యలపై విస్తృతంగా చర్చ జరిగినట్లు ఆయన వివరించారు. ముఖ్యంగా కాకినాడ–వారణాసి రైలు సర్వీస్ ప్రారంభం, కాకినాడ నుంచి బెంగళూరు వరకు వందే భారత్ రైలు ప్రతిపాదన, కాకినాడ రైల్వే స్టేషన్ వద్ద ఆటో స్టాండ్‌కు సంబంధించిన సమస్యలను అధికారుల ముందుంచినట్లు తెలిపారు.

# చెన్నెంపేటలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పంపిణీ

**ఎటపాక, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా ఎటపాక మండలం ఎటపాక పంచాయతీలోని చెన్నంపేట రాజుపేట గ్రామాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి విజయభాస్కర్ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయడం జరిగింది. ఫిబ్రవరి 1 ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగా అనగా 31-1-2026 నాడు వృద్ధులకు వికలాంగులకు వితంతువులకు కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పింఛన్లు మన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుందని, ప్రతినెల ఒకటో తారీకుని పెన్షన్లు ఇచ్చి అవ్వ తాతలను పెద్ద కొడుకులా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదుకోవడం జరుగుతుందని, ఎన్ని కష్టాలు వచ్చినా రాజకీయ ఇబ్బందులు వచ్చినా సరే పెన్షన్‌దారుల కళ్ళలో ఆనందం చూడడం కోసం కేంద్ర ప్రభుత్వం సహకారంతో మన రాష్ట్ర ప్రభుత్వం ఒకటో తారీఖు న పెన్షన్లు పంపిణీ చేయడం జరుగుతుందని, ఒకవేళ ఒకటో తారీకున సెలవు వచ్చినట్లయితే



ఒకరోజు ముందుగానే పెన్షన్ ఇస్తున్న మొదటి రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్ అని మండల ఐటీడీపీ నాయకులు బాచినేని శ్రీకాంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి రాంబాబు, పసుపులేటి రాధాకృష్ణ, పసుపులేటి చలపతి, సచివాలయ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్ సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా శ్రీ స్వామివారి ప్రాకార సేవ



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో శ్రీ సత్యదేవుని శనివారం ప్రాకార సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు శ్రీస్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకముల సుగంధభరితమైన పుష్పములతో అలంకరించి తిరుచ్చి వాహనంపై ఆశీనులు గావించి వేదపండితుల మంత్రోచ్చరణ, మంగళ, వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది, ఆలయ ప్రధాన అర్చకులు,వ్రత పురోహితులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ళు - బొల్లా పుల్లయ్య

**ఎటపాక, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఉంటుంది అని, సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ళు అని టీడీపీ మండల అధ్యక్షులు బొల్లా పుల్లయ్య అన్నారు. ముదస్తు భోరోసా పెన్షన్ పంపిణి సందర్బంగా పోలవరం జిల్లా ఎటపాక మండలం గన్నవరం గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షులు బొల్లా పుల్లయ్య ఆధ్వర్యంలో శనివారం వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ఎన్.టీ.ఆర్. భోరోసా పెన్షన్ పంపిణి చేయడం జరిగింది. ఈ సందర్బంగా బొల్లా ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని, రాష్ట్రంలో వున్నా ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమం అందించే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఆయన అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీను కూటమి ప్రభుత్వం నేరవేరుస్తుంది అని, ప్రతి ఒక్కరు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్ బాబు, వెల్ఫేర్ జయ, గన్నవరం గ్రామ కమిటీ అధ్యక్షులు ఏసుపాక బాలాజీ పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుండే విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

– డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)




**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** విద్యార్థి దశ నుండే క్రమశిక్షణ మంచి అలవాట్లు నేర్చుకుంటే చదివిన స్కూల్‌కి మంచి పేరు తీసుకు రావచ్చని కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు మరియు డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) తెలిపారు. శనివారం పెద్దాపురం పట్టణంలో స్థానిక పద్మనాభ కాలనీలో ఉన్న ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.జె.రవీంద్ర అధ్యక్షతన జరిగిన పిఎం శ్రీ వార్షికోత్సవ వేడుకలలో డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువులో మరియు క్రీడా రంగంలో కూడా దృష్టి పెట్టాలని, తద్వారా మీకు, మీరు చదివిన పాఠశాలకు మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. నేటి సమాజంలో స్త్రీలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రతీ ఒక్కరూ బాధ్యతగా చదువుకుని, ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయ ఆకాంక్షించారు. అనంతరం చదువులో ఉన్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

# భక్తజన సంద్రం, వేద మంత్రోచ్చారణల మధ్య వైభవంగా భీమేశ్వర స్వామి రథయాత్ర


– 'శంభో శంకర 'అంటూ రథయాత్రను ప్రారంభించిన మంత్రి వాసంశెట్టి సుభాష్




**ద్రాక్షారామం, మేజర్ న్యూస్ :** పంచారామక్షేత్రాల్లో ప్రముఖమైన ద్రాక్షారామ శ్రీ మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన రథయాత్ర కార్యక్రమం భక్త జన సందోహం.. వేదోక్త మంత్రోచ్చారణలు, శైవ ఆగమ శాస్త్ర పద్ధతుల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యంలు కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తి పారవశ్యంతో వేలాది మంది భక్తుల నడుమ స్వామివారి రథం ఊరేగుతూ ద్రాక్షారామ వీధులు భక్తి శబ్దాలతో మార్మోగాయి. శ్రీ భీమేశ్వర స్వామి కటాక్షం మనందరికీ దైవ బలమని, భక్తి, సేవ, సమర్పణే సమాజానికి పునాది అని పేర్కొన్నారు. రథయాత్రతో ద్రాక్షారామం ఆధ్యాత్మిక కాంతులతో విరాజిల్లిందని, ఇటువంటి ధార్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, సద్భావనను పెంపొందిస్తాయని మంత్రి తెలిపారు. దేవాలయాల అభివృద్ధి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకట దుర్గా భవాని, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం, ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిశ్వంత రాయ్, ద్రాక్షారామం సర్పంచ్ కొత్తపల్లి అరుణ, దేవస్థాన అధికారులు, వేద పండితులు, ఆలయ కమిటీ సభ్యులు, వేలాది మంది భక్తులు పాల్గొని రథయాత్రను ఘనంగా నిర్వహించారు.

# నల్లరాయి క్వారీ నష్టాలపై విచారణకు ఆదేశాలు





**– జిల్లా కలెక్టర్, గిరిజన సంక్షేమ డైరెక్టర్‌కు నోటీసులు**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో గంగవరం మండలం ఓజుబంద నల్లరాయి క్వారీల వలన ప్రజలకు జరుగుతున్న నష్టాలపై విచారణకు జాతీయ షెడ్యూల్డ్ తెగల కమీషన్ ఆదేశాలు జారీ చేసినట్టు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను శనివారం తెలిపారు. ఈమేరకు జిల్లా కలెక్టర్, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ కు నోటీసులు ఇచ్చారని తెలిపారు. పోలవరం జిల్లా రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతాల్లో నల్ల రాయి క్వారీల వలన స్థానిక ఆదివాసి ప్రజలకు జరుగుతున్న నష్టంపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాజీలేని పోరాటం చేస్తుందని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను పేర్కొన్నారు. గంగవరం మండలం జగ్గంపాలెం పంచాయతీ ఓజుబంద గ్రామంలో నిర్వహిస్తున్న నల్లరాయి క్వారీలతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, నివాస గృహాలు బీటలు వారుతున్నాయని, పంట పొలాలు నష్టపోతున్నాయని, రోడ్లు పాడైపోతున్నాయని, పర్యావరణ కాలుష్యం జరుగుతుందని ప్రజలకు ఆరోగ్యం క్షీణిస్తుందని వీటన్నిటిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. నల్లరాయి క్వారీల వలన ప్రజలకు నష్టమే జరుగుతుంది తప్ప ఎటువంటి లాభం లేదని, దీని వలన మైనింగ్ మాఫియా, కొంతమంది అధికారులు మాత్రమే లాభపడుతున్నారని, తక్షణమే నల్లరాయి క్వారీలను మూసివేయాలని కోరుతూ ఓజుబంధ గ్రామ ప్రజలు రెండు నెలలు నుండి ఆందోళన చేపడుతూ, జిల్లా కలెక్టర్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్, మైనింగ్ డిపార్ట్మెంట్ అధికారులకు అర్జీలు పెట్టుకున్నప్పటికీ, సంబంధిత శాఖలు ఎటువంటి క్షేత్రస్థాయి విచారణ జరపకుండా మైనింగ్ మాఫియాకు కొమ్ము కాస్తూ సమస్యను పక్కదారి పట్టిస్తూ కాలం గడుపుతున్నారని, దీనిపై బాధిత ప్రజల తరపున ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ న్యూఢిల్లీ వారికి ఫిర్యాదు చేయడం జరిగిందని ఆయన తెలియజేశారు. ఫిర్యాదు స్వీకరించిన కమిషన్ జిల్లా కలెక్టర్, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయవాడ వారికి నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలిపారు.

విచారణ జరిపి పది రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారని, లేకపోతే సంబంధిత అధికారులు కమిషన్ ముందు హాజరు కావలసి ఉంటుందని నోటీసులో పేర్కొన్నట్టు ఆయన తెలియజేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసులు అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, కొంతమంది ఆదివాసీ రాజకీయ ద్రోహులు ప్రజల్ని మభ్యపెడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమ మైనింగ్‌లు కొంతమంది నాన్ ట్రైబల్స్‌కు దోచిపెడుతున్నారని, ఆదివాసీలంతా ఐక్యంగా కలిసి ఉద్యమం చేస్తే మైనింగ్ వల్ల ఆదివాసులకు జరుగుతున్న నష్టాన్ని అరికట్టవచ్చునని, రాజకీయాలకు అతీతంగా మైనింగ్ దోపిడీపైన, నల్లరాయి క్వారీల వలన ప్రజలకు జరుగుతున్న నష్టంపైన ఆదివాసి సంక్షేమ పరిషత్‌తో కలిసి ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎటువంటి ప్రలోభాలకు, బెదిరింపులకు, దాడులకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ భయపడదని, ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉద్యమిస్తామని ఆయన తెలియజేశారు.

# కళాకారుడు 'పండు'ను కోల్పోవడం కళారంగానికి తీరని లోటు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** స్నేహ ఆర్ట్స్ వ్యవస్థాపక సభ్యులు వెన్నా సత్యనారాయణ (పండు) ను కొల్పోవడం నాటక రంగానికి తీరని లోటు అని స్నేహ ఆర్ట్స్ అధ్యక్షులు గొందేసి రాజా అన్నారు. స్నేహ ఆర్ట్స్ నిర్మాణంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటిల నిర్వహణలోను వెన్నా పండు ముఖ్య భూమిక పోషించేవారని జనవరి 24 నుండి మూడు రోజుల పాటు జరిగిన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీల నిర్వహణలో స్వర్గీయ వెన్నా సత్యనారాయణ (పండు) పూర్తిగా నిమగ్నమై పనిచేశారని అతని లేని లోటు స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్‌కు తీరని లోటు అని స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ అధ్యక్షులు రాజా, కంటిబోయిన ప్రసాద్, పాలాని సత్తిబాబు, జ్యోతుల దొరబాబు, శివాజి, దేవాడ పాపేశ్వరరావు, మాగాపు నాగు, సూరిబాబు, కేదారి నాగు, స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నివారణపై కలసికట్టుగా పని చేద్దాం

**– మెరైన్ ఇన్స్పెక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి**




**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ , పీజీ కళాశాల విద్యార్థులకు మెరైన్ పోలీస్ డిపార్ట్మెంట్ మరియు వివిధ రక్షణ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేకతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ.జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్ నాయుడు తెలియజేశారు. మెరైన్ డిపార్ట్మెంట్ ఉత్తర్వుల మేరకు కాకినాడ అటవీ శాఖ, కోస్ట్ గార్డ్, నేవి, ఎస్పీఎఫ్ వంటి రక్షణ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వ్యతిరేకతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ వ్యసనాలకు బానిస కాకూడదని, దేశ ప్రగతికి నాంది పలకాలని, విద్యార్థులు లక్ష్యసాధనకే కృషి చేస్తూ తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మెరైన్ ఇన్స్పెక్టర్ టి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. గంజాయి నిర్మూలన కోసం, సముద్ర తీర ప్రాంతంలో పాటించవలసిన నియమాల కోసం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. కొత్త వారితో పరిచయాలు వద్దని, ఏదైనా ఆశ చూపించే వారిని అసలు నమ్మవద్దు అని, తల్లిదండ్రులే ప్రధానమని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల కేసులకు సంబంధించిన టువంటి శిక్షలను, 1972 టోల్ ఫ్రీ నెంబర్ యొక్క ప్రాధాన్యతను తెలిపారు. యువతే లక్ష్యంగా మత్తు పదార్థాల వాడకం జరుగుతుందని విద్యార్థుల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వాడకం చాప కింద నీళ్లు వ్యాపిస్తుందని, వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబ పరంగా ఇబ్బంది పడాల్సి వస్తుందని కనుక ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. విద్యార్థి తమ లక్ష్యాలను ఎన్నటికీ వదలకూడదని ఉన్నత ఉద్యోగాలను సాధించాలని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని రక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టీ తేజేశ్వరరావును, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను పోలీసు అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీమతి బిఎస్ పద్మజ, మెరైన్ ఎస్ఐ సురేష్, ఇండియన్ నేవీ ఆఫీసర్ సంజీవ్ కుమార్ ఇండియన్ కోస్ట్ గార్డ్ ఆఫీసర్ బల్జిత్, ఎస్పీఎఫ్ ఏఎస్ఐ పి శాంతి ఈశ్వరరావు, మరియు పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రక్షణ శాఖ విభాగాలను, ఎన్ఎస్ఎస్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్ శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ ఎన్. సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు.

## ఉద్యోగుల సంఘం క్యాలెండరు ఆవిష్కరణ



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విశ్రాంత ఉద్యోగులు, టీచర్లు, కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా జాయింట్ యాక్షన్ కమిటీ పనిచేస్తుందని సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కేతా శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర కో–చైర్మన్, డ్వామా ఏపిడి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో జేఏసీ రాష్ట్ర నాయకులు శనివారం రంపచోడవరంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, ఇన్చార్జ్ పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను జేఏసీ ప్రతినిధుల కోరిక మేరకు ఐటీడీఏ పిఓ ఆవిష్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు కేతా శ్రీనివాస్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన పోలవరం జిల్లాలో ఆదివాసీల సంక్షేమానికి, గిరిజన ప్రాంత అభివృద్ధికి ఉద్యోగ సంఘ జేఏసీ కృషి చేస్తుందన్నారు. త్వరలో నూతనంగా ఏర్పడిన పోలవరం జిల్లాలో నూతన కమిటీ ఏర్పాటు చేస్తామని అధ్యక్షులు కేతా శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు బోండ్ల వరప్రసాద్, వెంకటేశ్వరావు, బి.హెచ్.మహాలక్ష్మి, డి.వి.బిఎస్.ఎన్ మూర్తి, అడ్వకేట్ చింతపర్తి రాంబాబు, బండారు శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీ పరిశీలించిన ఎంపీడీవో



**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ప్రతినెల క్రమం తప్పకుండా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిరుపేదలకు అందిస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమం అడ్డతీగల మండలంలో సచివాలయ సిబ్బంది ఏవిధంగా పంపిణీ చేస్తున్నారో పరిశీలించేందుకు అడ్డతీగల ఎంపీడీవో ఏవివి కుమార్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని వేట మామిడి గ్రామంలో పర్యటించి పింఛన్లు అందుతున్న విధానాన్ని స్వయంగా అక్కడి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పంపిణీ చేస్తున్న సిబ్బంది లబ్ధిదారుల పట్ల ఏ విధంగా ప్రవర్తిస్తున్నారు అలాగే పింఛన్ల సొమ్ములో ఏమైనా కోతలు విధిస్తున్నారా అనే విషయాలపై లబ్ధిదారులతో మాట్లాడారు. పింఛన్ల పంపిణీలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని పింఛన్దారులకు సూచించారు. అలాగే మండలంలో పింఛన్లు పంపిణీ చేసే సిబ్బంది నూటికి నూరు శాతం ఇచ్చిన తేదీలో పంపిణీ చేయాలని లేనిపక్షంలో మరుసటి రోజు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు ప్రస్తుతం మండలంలో 5232 మంది పింఛనుదారులు ఉండగా శనివారం సాయంత్రం నాటికి 4432 మందికి పింఛన్లు అందించినట్లు పేర్కొన్నారు. మిగిలిన 800 మందికి సోమవారం నాడు పంపిణీ చేస్తామని వెల్లడించారు.

## ఒక రోజు ముందుగానే పెన్షన్ పంపిణీ



**పెరవలి,మేజర్‌న్యూస్ :** నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామం నందు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్దిదారులకు నేరుగా ఇంటివద్ద పెన్షన్ ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ మాజీ శాసనసభ్యులు మరియు నిడదవోలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, ఉప సర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాసరావు మరియు గ్రామ తెలుగుదేశం పార్టీనాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా పెరవలి మండల వ్యాప్తంగా వేకువ జామునుండే కూటమి నాయకులు, కార్యకర్తలు సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరుగుతూ పెన్షన్ పంపిణీ చేశారు.

# ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీలో తాత్సారం చేయము

– ఒక రోజు ముందే పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే శిరీషాదేవి



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** సామాజిక, ఆర్థికావసరాలు గలవారికి సామాజిక పింఛన్లు అందించే క్రమంలో ఎలాంటి తాత్సారం చేయకుండా కూటమి ప్రభుత్వం పటిష్టంగా అమలు చేస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం కొండపల్లి గ్రామంలో శనివారం ఏపీఐఐసీ డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు సౌజన్యం లో ఆమె పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక పింఛన్లు అందించే క్రమంలో గత వైకాపా ప్రభుత్వం కన్నా అత్యంత పారదర్శకంగా వేగవంతంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పింఛన్లు పంపిణీ తేదీ ఒకవేళ ప్రభుత్వసెలవు రోజు అయితే ముందురోజే ఇంటింటికీ మరీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయటంజరుగుతుందన్నారు. గతంలో కన్నా ప్రస్తుతం పింఛన్లు పంపిణీ ఎలాంటి లోపాలు లేకుండా వేగవంతంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూవారి వద్ద కూర్చుని వారి యోగ క్షేమాలు అడుగుతూ పింఛన్లు అందించారు. పింఛన్లు పంపిణీలో ప్రభుత్వం నుండి ఎలాంటి ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని లబ్ధిదారులను అడిగి తెలుసు కున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో కన్నా ప్రస్తుతం కూటమి సర్కార్ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పింఛన్లు పంపిణీ చేసే సిబ్బంది నుండి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తనకు తెలియచేయాలని పేర్కొన్నారు. దీనితో పాటు గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తనదృష్టిలో పెట్టాలని కోరారు. పలు మౌలిక సమస్యలపై ఆమెకు తెలియజేయగా పరిష్కార చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

# అక్రమ గ్రావెల్, మట్టి, రాయి తవ్వకాలపై న్యాయవిజ్ఞాన సదస్సులో ఫిర్యాదు

**శంఖవరం, మేజర్ న్యూస్ :** ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు భూములలో విస్తృతంగా జరుగుతున్న అక్రమ గ్రావెల్, మట్టి, రాయి తవ్వకాలపై సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ న్యాయవిజ్ఞాన సదస్సులో న్యాయాధికారులకు ఫిర్యాదు అందింది. మండలంలోని పెదమల్లాపురం గ్రామంలో నిర్వహించిన జిల్లా న్యాయవిజ్ఞాన సదస్సుకు విచ్చేసిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రిన్సిపాల్ మరియు సెషన్ జడ్జి, ప్రత్తిపాడు కోర్టు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎల్. గోపినాథ్ సమక్షంలో సామాజిక కార్యకర్త మేకల కృష్ణ స్వయంగా కలిసి ఫిర్యాదు చేశారు.



శంఖవరం మండల పరిధిలో అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్, మట్టి, రాయి తవ్వకాలు జరుగుతున్నాయని, దీనివల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమ తవ్వకాలపై గతంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కొందరు అధికారులు అక్రమ తవ్వకందారులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపించారు. ఇలాంటి అక్రమ తవ్వకాల వల్ల గ్రామాల్లో భూగర్భ జలాలు తగ్గిపోవడం, రహదారులు దెబ్బతినడం, వ్యవసాయ భూములు నాశనం కావడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ప్రజల భద్రత, భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని న్యాయాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన న్యాయాధికారులు, విషయం పరిశీలించి చట్టపరంగా తగిన చర్యలు తీసుకునేలా సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

# డీఎస్పీగా ఎంపికైన మధుచరణ్‌కు అభినందనలు



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** గ్రూప్ వన్ ఫలితాల్లో ( సివిల్ ) డీఎస్పీగా ఎంపికైన జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామానికి చెందిన కళ్లపల్లి మధు చరణ్‌ను శనివారం అభినందించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై టి.రఘునాథరావు ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం శాలువాతో ఘనంగా సత్కరించారు. సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతిభ ఉంటే ఏదైనా సాధించవచ్చునన్నారు. చిన్న వయసులోనే డిఎస్పీగా ఎంపికైన మధుచరణ్ మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని ఎస్సై ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎం.వి. సాయిరామ్, కళ్ళపల్లి అప్పారావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జగన్మోహనరావు సేవలు మరువలేనివి

– పదవీవిరమణ సభలో వక్తలు ప్రశంసలు



**కాజులూరు, మేజర్ న్యూస్ :** కాజులూరు మండలం కోలంక గ్రామంలో శ్రీ దంతులూరి వెంకట రాయప రాజా హైస్కూల్ లో ఉపాధ్యాయుడుగా పనిచేసిన పేకేటి జగన్మోహనరావు పదవీ విరమణ సన్మానము ఘనం గా జరిగింది. ఈ కార్యక్రమానికి హైస్కూల్ హెడ్ మాస్టర్ వి.శివకుమారి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా స్కూల్ కరస్పాండెంట్ దంతులూరి అనంత వర్మ హాజరయ్యారు. గత 32 సంవత్సరాలు సైన్స్ ఉపాధ్యాయుడుగా పనిచేసి, విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో జగన్మోహనరావు చాలా కృషి చేశారని,చాలా మంది ఉన్నతమైన స్థాయిలో స్థిరపడ్డారని అనంత వర్మ అన్నారు.పదవీ విరమణ అనేది కేవలం వృత్తికి మాత్రమే అని జగన్మోహనరావు శేషజీవితం ఆరోగ్యంగా సంతోషంగా గడపాలని హెడ్మాస్టర్ శివకుమారి అన్నారు.ఓల్డ్ స్టూడెంట్స్ తరుపున ఓలేటి రమణ మూర్తి మరియు హైస్కూల్ డైరెక్టర్ కొటికెలపూడి వెంకటరావులు జగన్మోహనరావుకు ప్రత్యేక అభినందలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు డి కొండరాజు, బి రాముడురాజు,డి దేవదానం రాజు యాళ్ళ సత్యనారాయణతో పాటు హైస్కూల్ సిబ్బంది వి ఎస్ ఆర్ వి ఎస్ ఎస్ మూర్తి ,కనుమూరి రామకృష్ణ, పి ఎం రామనాథ , ఎమ్ ఎస్ విజయరాణి, ఎస్ ఏ యున్నీసా, మంజు మరియు స్నేహితులు,గ్రామస్తులు,ఓల్డ్ స్టూడెంట్స్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అందరికీ జగన్మోహనరావు కృతజ్ఞతలు తెలిపారు.

## వీధి బాలల హక్కుల పరిరక్షణ ప్రతి పౌరుని బాధ్యత

– పిఠాపురం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి డా.ఎం.బాబు
– బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి




**పిఠాపురం, మేజర్ న్యూస్ :** జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ జిల్లా బాల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి. దుర్గారాణి ఆధ్వర్యంలో... చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాల నందు ప్రిన్సిపల్ డాక్టర్ వి. శ్రీనివాసరావు అధ్యక్షతన అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం సందర్భంగా మరియు బాల్ వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమంపై ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిఠాపురం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఎం. బాబు పాల్గొని మాట్లాడుతూ... వీధి బాలల హక్కుల పరిరక్షణ ప్రతి పౌరుని బాధ్యత అని, బాలలపై జరుగుతున్న అన్యాయాలను నివారించేందుకు చట్టాలపై అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమన్నారు. గౌరవ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారు ఆదేశాలు మేరకు బాల్య వివాహ రహిత భారత దేశముగా తీర్చి దిద్దాలనే లక్ష్యముతో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ఏర్పాటుచేసినట్లు తెలిపారు. జిల్లా బాల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి. దుర్గారాణి మాట్లాడుతూ... బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, బాల్య వివాహ నిషేధ చట్టం – 2006 ప్రకారం శిక్షార్హమైన నేరమని, అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు పూర్తి కాకుండా వివాహం చేయరాదని అన్నారు.బాల బాలికలకు విద్య ఎంతో కీలకమని, చదువు పూర్తి చేయడం ద్వారానే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో కళాశాల డీన్ ఎస్వీఆర్కే రావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైవియన్ రాజశేఖర్, వి ఎస్ ఎన్ మూర్తి ఏ జి పి , ఎంపీడీవో విద్యాసాగర్ కుమార్, వి. శ్రీనివాసరావు, ఈ. వెంకట శివప్రసాద్, ప్యానల్ లాయర్ అడ్వకేట్స్ యస్ ఎమ్ అలీ, ఈశ్వర్ బాబు, శ్రీనివాసరావు, అప్పారావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం. రాజారావు, ఎమ్ సుబ్బారావు, యన్ యస్ యస్ పీడీ, పారా లీగల్ వాలంటీర్స్ సూరిబాబు మరియు కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# గోవిందా... ముకుందా

– భక్త జనంతో శోభిల్లిన వెంకన్న క్షేత్రం





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా కోరిన కోర్కెలు తీర్చే దైవంగా విరాజిల్లుతున్న వాడపల్లి వెంకటేశ్వరస్వామి వారి ఆలయం శని త్రయోదశి పర్వదినం సందర్భంగా వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించారు. ఆలయ ప్రాంగణమంతా భక్తుల గోవింద నామ స్మరణతో మార్మోగింది. ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడితో రాష్ట్రాల నుండి వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించి మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజనం మంత్రపుష్పం పుణ్యా వచనం, కళ్యాణం వంటి కార్యక్రమాలను అర్చక బృందం వైభవంగా నిర్వహించారు. కాలినడకన వచ్చే భక్తులకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. శనివారం స్వామివారి ఆదాయం రూ.55 లక్షలు సమకూరింది. ఆలయంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, ఎస్ఐ ఎస్.రాము, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# రామచంద్రపురంలో 'సుభాష్' ప్రభంజనం.. కుప్పకూలుతున్న వైసీపీ కోటలు!





**చంద్రబాబు నాయుడు అజేయమైన పాలన,లోకేష్ పక్కా వ్యూహారచనతో రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా సాగుతున్న స్వర్ణయుగ పాలన.జన హృదయ విజేత మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రజాపక్షపాతిగా నిలబడటం, నియోజకవర్గంలో ఆయన చేస్తున్న అభివృద్ధి అశ్వమేధ యాగం.సేవలో 'సత్యం' మార్కుతో వాసంశెట్టి సత్యం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేదల కన్నీళ్లు తుడుస్తూ, మహిళా సాధికారతకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలుస్తున్న సేవలు. వైసీపీ ఖాళీ.. టీడీపీ క్లీన్ స్వీప్‌గా వెంకటాయపాలెం సాక్షిగా కుప్పకూలిన వైసీపీ ప్రాబల్యం..మంత్రి సుభాష్ నాయకత్వానికి జైకొట్టిన 50 కుటుంబాలు.**

**రామచంద్రపురం నుంచి ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** రాష్ట్ర రాజకీయాల్లో రామచంద్రపురం నియోజకవర్గం ఇప్పుడు అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలనాదక్షత,యువనేత నారాలోకేష్ క్రమశిక్షణతో కూడిన దిశానిర్దేశం, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సేవా దృక్పథం వెరసి.. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తిరుగులేని శక్తిగా అవతరిస్తోంది. శనివారం వెంకటాయపాలెం గ్రామంలో జరిగిన భారీ చేరికలు నియోజకవర్గ రాజకీయ చిత్రపటాన్ని మార్చేశాయి.

**అభివృద్ధికి ఆకర్షితులై.. సుభాష్ నాయకత్వంపై నమ్మకంతో..**

వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలకు స్వస్తి పలికి, మంత్రి వాసంశెట్టి సుభాష్ చేస్తున్న సామాజిక సేవ, అభివృద్ధి మంత్రానికి ముగ్ధులై 50 మంది వైసీపీ కార్యకర్తలు పచ్చ కండువా కప్పుకున్నారు. మంత్రి సుభాష్ స్వయంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కేవలం అధికారం కోసమే కాకుండా, ప్రజల కష్టాల్లో తోడుండే నాయకుడిగా సుభాష్ సంపాదించుకున్న గుర్తింపే ఈ భారీ చేరికలకు కారణమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వాసంశెట్టి సత్యం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా జరుగుతున్న సేవా కార్యక్రమాలు నియోజకవర్గ ప్రజానీకానికి కొండంత అండగా నిలుస్తున్నాయి.

**నాడు అరాచకం.. నేడు ఆదర్శం**

మంత్రి సుభాష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. "గత వైసీపీ పాలనలో ప్రజలు నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయారు. నేడు చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి మళ్లీ స్వర్ణయుగాన్ని తీసుకొస్తోంది. రామచంద్రపురంలో అభివృద్ధి ఆగదు, సంక్షేమం ఆగదు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటాం" అని మంత్రి సుభాష్ భరోసా ఇచ్చారు.

**గ్రామ స్థాయిలో మారుతున్న సమీకరణలు**

వెంకటాయపాలెం గ్రామానికి చెందిన గుంటల శ్రీనివాస్, పెయ్యల బాబేలు, కనికళ్ళ సూర్యనారాయణ, తనికెళ్ల మహేష్, నంది కోళ్ల సుబ్రమణ్యం, పచ్చిమాల సోమేశ్, నంది కోళ్ల ఏసేపు, తనికెళ్ల శ్రీనివాస్, తాతపూడి ప్రసాద్, యార్లగడ్డ తాతారావు, సుందరపల్లి సాయిబాబు, పెయ్యల పద్మలక్ష్మి, కోటి అనంత కుమారి, కోటి నాగమణి, గుబ్బల సునీత, పి.జీవరత్నం తదితరులు టీడీపీలో చేరడంతో గ్రామంలో వైసీపీ ఖాళీ అయినట్లయ్యింది. కూటమి ప్రభుత్వ పాలన భేష్ అంటూ కార్యకర్తలు నినదించడం నియోజకవర్గంలో టీడీపీకి పెరుగుతున్న ఆదరణకు నిదర్శనం...

## వెంకన్నకు పూజలు చేసిన వైయస్సార్ పార్టీ నాయకులు



**పెరవలి, మేజర్ న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశానుసారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో జనవరి 31వ తేదీ శనివారం పెరవలి మండల వైయస్సార్ పార్టీ కార్యకర్తలు అన్నవరప్పాడులో కొలువై వున్న కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తిరుపతి లడ్డు విషయంలో అసత్యప్రచారాలు చేసిన ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి మంచి బుద్ధి ప్రసాదించాలని ఆ భగవంతుని కోరుకొంటూ పూజలు నిర్వహించారు. దేవుడుతో రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మండల వైయస్సార్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీవారి లడ్డు ప్రసాదంపై అసత్య ప్రచారం తగదు

**– పిఠాపురం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వంగా గీతా విశ్వనాథ్**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** భక్తులు అత్యంత పరమ పవిత్రంగా భావించే శ్రీవారి లడ్డు ప్రసాదంపై అసత్య ప్రచారం తగదని పిఠాపురం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వంగా గీతా విశ్వనాథ్ అన్నారు. తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదం పై సిబిఐ (సిట్) ఇచ్చిన రిపోర్ట్ నేపథ్యంలో... పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు పిఠాపురం స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వెంకటేశ్వర స్వామి వారికి పాప ప్రక్షాళన పూజలు నిర్వహించారు. టెంకాయలు కొట్టి స్వామివారిని వేడుకున్నారు. స్వామి వారి లడ్డు ప్రసాదం పై అసత్య ఆరోపణలు చేసిన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్టీ శ్రేణులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వంగా గీత విశ్వనాథ్ మాట్లాడుతూ ఎన్నికల్లో చేసిన దుష్ప్రచారం, అభూత కల్పనలు, అసత్య ఆరోపణలు, ఈవీఎంల సహాయంతో ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చినా కూడా.. జగన్మోహన్ రెడ్డి అంటే కోపం, అసూయ, ద్వేషం నింపుకున్న చంద్రబాబు అండ్ కో సాక్షాత్తు శ్రీ వెంకటేశ్వర స్వామిని సైతం రాజకీయాలకు వాడుకోవడం భక్తుల మనోభావాలను దెబ్బతీయటమేనని అన్నారు. ఈ దుష్ప్రచారాన్ని ఇంతటితో నిలుపుదల చేయాలని, సిబిఐ రిపోర్టు లైన్ టు లైన్ చదువుకోవాలని, మీకు నిజంగా వెంకటేశ్వర స్వామి మీద భక్తి ఉంటే, ప్రజాస్వామ్యం మీద విశ్వాసముంటే, ప్రజలంటే గౌరవం ఉంటే, భక్తుల మనోభావాలను గౌరవించే వారైతే, ఈ దుష్ప్రచారాన్ని ఆపాల్సిన బాధ్యత మీ పైన ఉందన్నారు. సాక్షాత్తు వెంకటేశ్వర స్వామి మీద అసత్య ఆరోపణలు చేసినందుకు గాను ఆ స్వామి




ఆగ్రహానికి మీరు గురికాక తప్పదని అన్నారు. భక్తులకు అండగా వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, జగన్మోహన్ రెడ్డి దేనికి భయపడే వ్యక్తి కాదని, దేనికి బెదిరే వ్యక్తి కాదని, మీరు ఎంతో దుష్ప్రచారం చేసి ఆయన ప్రతిష్టను దిగజార్చాలని చూశారని, అయినప్పటికీ సాక్షాత్తు ఆ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం జగన్మోహన్ రెడ్డి పై ఉందన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా జగన్మోహన్ రెడ్డి వెన్నంటే ఉన్నారని, కూటమి నాయకులకు జ్ఞానాన్ని ప్రసాదించమని ఈరోజు శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని వేడుకోవడం జరిగిందన్నారు.వెంకటేశ్వర స్వామి దయవలనే ఎలాంటి కల్తీ జరగలేదని రిపోర్టు వచ్చిందని, స్వామివారి ప్రసాదం పై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆపాల్సిన బాధ్యత కూటమిలోని మూడు పార్టీల పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ధర్నా



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, పట్టణంలోని శానిటేషన్ వ్యవస్థను మెరుగుపరచాలని, సిపిఎం ఆధ్వర్యంలో సిఐటియు, ఐద్వా, భవన నిర్మాణ, రిక్షా కార్మిక సంఘం నాయకులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం మండల కన్వీనర్ కె.చిన్న, ప్రజా సంఘాల నాయకులు నాగేశ్వరరావు, కోనేటి రాజు, డి.సత్యానారాయణ, కె.మణిలు మాట్లాడుతూ పట్టణంలో అనేక వార్డుల్లో డ్రైనేజీలు నిర్మించాలని, శానిటేషన్ వ్యవస్థను మెరుగుపరచాలని అధికారులకు గతంలో ఎన్ని వినతులు ఇచ్చినా చర్యలు మాత్రం శూన్యమన్నారు. 29వ వార్డులో వర్షం వస్తే నీరు ఇళ్ళలోకి వస్తుందని, రాపర్తి వెళ్ళు నాలుగు రోడ్లు జంక్షన్ వద్ద బైపాస్ రోడ్డు కింద నివాసం ఉంటున్న ప్రజలకు వ్యక్తిగత కొళాయి కనెక్షన్లు మంజూరు చేయాలని, డ్రైనేజీలు నిర్మించాలని, ఉప్పాడ బస్టాండ్ నుంచి గవర్నమెంట్ హాస్పటల్ వరకు ఉన్న ప్రధాన రహదారిపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని, పిఠాపురం ఉప్పాడ పై ఓవర్ బ్రిడ్జి తక్షణం నిర్మించాలని, నిర్మాణ సమయంలో స్థలాలు, ఇళ్ళు కోల్పోయే వారికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు రోడ్ల మీద వరకు తమ వ్యాపారాలు సాగించడంతో మార్కెట్లో ప్రజలు అటు ఇటు తిరగడానికి సరైన మార్గం లేక ఇబ్బంది పడుతున్నారని ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న కౌన్సిల్ సమావేశం హాల్ బయట సమస్యలు పరిష్కరించారని నినాదాలు చేశారు. కమిషనర్ ఎన్. కనకరావు కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శానిటేషన్, డ్రైనేజి నిర్మాణానికి, కుళాయిలు, వీధి లైట్ల మరమత్తులకు నిధులు మంజూరైనాయని సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జి. వీరబాబు,కె విశ్వనాథం,ఎం సూరిబాబు, శ్రీను, సూర్యనారాయణ, పప్పుల వీరబాబు, ఓ.గోవిందు, నాగు, జయమ్మ, పి.సత్యనారాయణ, ఎస్.సత్తిబాబు, దుర్గమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ సన్మాన సభ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** శనివారం ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లకు కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ సన్మాన సభ నిర్వహించారు.కాకినాడ 2 టౌన్ లా & ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం. వెంకటేశ్వరరావు మరియు కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయం సిసిసి విభాగంలో పనిచేస్తున్న మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్ డి. రాజ్యలక్ష్మి శనివారం ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా, కాకినాడ జిల్లాఎస్పీ జి.బిందుమాధవ్,ఐపీఎస్ తన కార్యాలయంలో వారిని సత్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ వారికి సాలువ కప్పి, పుష్పగుచ్చాలు అందజేసి వారి దీర్ఘకాల సేవలను కొనియాడారు. పోలీసు శాఖకు వారు అందించిన సేవలు అభినందనీయమని పేర్కొంటూ, ఉద్యోగ విరమణ అనంతరం వారి జీవితం ఆరోగ్య ంగా, ఆనందంగా కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్ర మంలో ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.వి.వి. సత్యనారాయణ, సీసీఎస్ రాంబాబు, వెల్ఫేర్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు, కాకినాడ జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.